## రాందాస్‌గూడకు బీటీ రోడ్డు మంజూరు



చిలిపిచెడ్: బీటీ రోడ్డు మంజూరైన పత్రం చూపుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, మే 7: రాందాస్ గూడ నుంచి గౌతాపూర్ వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని గౌతాపూర్ బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే స్వగృహంలో బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే వారికి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి త్వరగా బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గౌతాపూర్‌కు చెందిన కర్ణం విష్ణువర్ధన్‌కు రూ.13 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు విఠల్, శంకరయ్య, మనోహర్‌రెడ్డి, భీమయ్య, కృష్ణ, నవాజ్‌గౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.

## భూ భారతితోనే సమస్యల పరిష్కారం

**నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి**



అజ్జమర్రిలో రైతుల దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

చిలిపిచెడ్, మే 7: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఫైజాబాద్, అజ్జమర్రి గ్రామాల్లో భూ భారతి కార్యక్రమంలో భాగంగా సమస్యలపై దరఖాస్తులను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో రెవెన్యూ అధికారులకు క్షేత్రస్థాయిలో అవగాహన వస్తుందన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బండపోతుగల్‌లో సోమక్కపేట సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మిన వెంటనే తమ పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్లు సహదేవ్, ఆంజనేయులు, రైతులు ఉన్నారు.

## వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

పాపన్నపేట,మే 7: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఆర్డవో రమాదేవి సూచించారు.బుధవారం ఆమె మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడితే ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు.త్వరగా కొనుగోళ్లు, రవాణా జరగాలని ఆదేశించారు.ఆమె వెంట తహసిల్దార్ సతీష్ కుమార్,ఐకేపీ ఏపీఎం సాయిలు, సీసీ సెంటర్ నిర్వాహకులు ఉన్నారు.

## యాసంగిలో 15,184 ఎకరాల్లో సాగు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

రామాయంపేట, మే 7: యాసంగిలో మండల వ్యాప్తంగా 15,184 ఎకరాల్లో పంట సాగయ్యిందని తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. వానకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరిపడా ఉన్నాయన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో మండల వ్యవసాయశాఖ, హార్టికల్చర్, ఇరిగేషన్ అధికారులతో వానకాలం పంటలపై ముందస్తు సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వానకాలానికి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సిద్ధంగా ఉండేలా మండల స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారి రాజ్ నారాయణ, ప్లానింగ్ అధికారి కవిత, ఇరిగేషన్, హార్టికల్చర్ అధికారులు ఉన్నారు.


## వృద్ధులపై నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు



వృద్ధులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హేమలత

నర్సాపూర్, మే7: వృద్ధులపై నిర్లక్ష్యం వహిస్తే చట్టకీత్యా చర్యలు తీసుకుంటారని జూనియ ర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ చైర్మన్ ఎం.హేమలత హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్‌లోని తారాలక్ష్మీ డాంగోరియా ఓల్డ్ ఏజ్ హోమ్, డాంగోరియా చారిటబుల్ ట్రస్ట్‌ను న్యాయమూర్తి ఎం.హేమలత పర్యవేక్షించి, వృద్ధులకు పండ్లు పంపిణీచేశారు. ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం వృద్ధులను వారి సంతానం అలసత్వం వహిస్తే తిరిగి పిల్లల నుంచి స్థిరాస్తులు వృద్ధులకే సంక్రమిస్తాయన్నారు. మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీఎల్‌సీ కేసు బాధితులైన శ్రీశైలంను పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకెళ్ళి న్యాయబద్ధమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న బిఆర్ఎస్ నాయకులు.

చిన్నశంకరంపేట, మే7: చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలో చౌటకూరి బాలమణి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం సంతాపం తెలిపారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ బందెళ్ల ప్రభాకర్ ద్వారా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గడ్డం సురేశ్, చౌటకూరిశ్యామ్, చౌటకూరి సిద్ధిరాములు, మోతీరాం, నగేశ్, ఎస్సీసెల్ వైస్ ప్రెసిడెంట్ బందెళ్ల సుధాకర్ పాల్గొన్నారు.

# మల్లె చెరువు కంపుకంపు

- రంగుమారి కంపు కొడుతున్న చెరువు నీళ్లు
- దుర్వాసనతో పట్టణవాసుల ఇబ్బందులు
- బోరుబావుల్లోనూ ఆకుపచ్చ రంగు నీరు
- రూ.30లక్షల నిధులు మంజూరైనా మొదలుకాని ఫెన్సింగ్ పనులు

రామాయంపేట, మే7: మల్లె చెరువు దుర్వాసనతో పట్టణవాసులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. చెరువు పట్టణానికి ఆనుకుని ఉండడంతో చెరువు దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువును ఆదునీకరిస్తామంటూ అధికారులు సర్వేలు చేసినా మల్లె చెరువు తీరు మాత్రం మారడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లె చెరువును మినీ ట్యాంకు బండ్‌గా మారుస్తామని ప్రతిపాదనలు చేసింది. నిధులు కూడా మంజూరు చేసింది. తీరా కొన్ని పనులు జరిగాయి. ఇంతలోనే కేసీఆర్ ప్రభుత్వం మారిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇక సుమారు రెండేండ్ల నుంచి నిధులేక సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేసివెళ్లిపోయాడు. చెరువును మళ్లీ ఆధునీకరిస్తామంటూ ప్రస్తుతం ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల సమయంలో హామీలు కురిపించింది. అప్పుడు ఓట్లేసుకున్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా నెల రోజుల క్రితం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు చెరువు రోడ్డుకు ఆనుకుని ఉండడంతో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు దారిపొడుగునా ఫెన్సింగ్, మురుగు కాల్వ స్లాబ్ వేసేందుకు రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. కాని ఆ రోడ్డు ఫెన్సింగ్ పనులు ఇంకా మొదలు కాలేదు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతందోననే పట్టణవాసులు భయాందోళనలు చెందుతున్నారు.

**రంగు మారి కంపు కొడుతున్న మల్లె చెరువు నీళ్లు**



మధ్యలోనే పనులు వదిలేసి పోయిన కాంట్రాక్టర్ కంకర తేలిన రోడ్డు



పచ్చరంగులో మల్లె చెరువు నీరు



మల్లె చెర్వులోకి వెళ్తున్న పట్టణ మురుగు కాల్వ



మురుగు, చెత్తాచెదారంతో పేరుకుపోయిన మల్లెచెరువు

రామాయంపేటలోని ముగు కాల్వల నీరంతా మల్లె చెరువులోకే రావడంతో నీరంతా కలుషితమై, పచ్చగా రంగుమారి కంపు వాసన వెదజల్లుతోంది. చెరువు సమీప ప్రాం తంలో ఉండే పట్టణవాసులు వాసన భరించలేక అనారోగ్యం బారిన పడుతున్నారు. వివిధ రోగాల బారిన పడి దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు. చెరువులోని నీళ్లలాగే వాళ్ల ఇండ్లలో ఉన్న బోరుబావుల నుంచి కూడా నీళ్లు పచ్చగా వస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలన్నీ కలుషితమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చెరువు దగ్గర ఉన్న కుటుంబాలు ఈ వాసన భరించలేక పోతున్నం బాబోయ్ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గోస ఆలకించి, మల్లెచెర్వును ఆధునీకరించాలని కోరుతున్నారు.

**దుర్వాసనతో ఉండలేక పోతున్నం**



మల్లెచెర్వు దుర్వాసనతో ప్రతి రోజు తాము ఇక్కడ ఉండలేక పోతున్నాం. తమ ఇంటిముందే చెరువు ఉండడంతో ఈ గబ్బుతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. ప్రభుత్వ అధికారులు ఈ దుర్వాసన పోయేందుకు చర్యలు తీసుకోవాలి. తమ ఇండ్లలో కూడా బోర్ల లోని నీరు పచ్చరంగుతో వస్తున్నాయి. మల్లె చెర్వులో ఉన్న నీరంతా తీసేస్తే మంచినీరు వస్తాయి. అధికారులు ముందు ఆ పని చేయాలి.

**-ఊర అమృత, రామాయంపేట**

**ఫెన్సింగ్, మురుగు కాల్వ స్లాబ్ కోసం నిధులు మంజూరు**

మల్లె చెరువు ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానిక ఎమ్మెల్యే దారిపొడుగునా ఫెన్సింగ్ వేయడం కోసం రూ.30లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది.త్వరలోనే వాటి పనులను ప్రారంభిస్తాం.పట్టణ వాసులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. కచ్చితంగా కొద్ది రోజుల్లోనే ఫెన్సింగ్ పనులు చేపడ్తాం.ప్రమాదాలను గుర్తించే ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు.

**-మున్సిపల్ ఏఈ.మహేశ్**

# ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- హౌసింగ్, మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 7 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ గృహాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా స్థానిక వనరులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయడంపై జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్, మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు పోవాలన్నారు. జిల్లాలో లక్షా 74 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక ఇందిరమ్మ ఇండ్లకు అవసరం ఉంటుందన్నారు. స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరాకు గ్రౌండ్ వాటర్, రెవెన్యూ మైన్స్ శాఖల సమన్వయం చేసుకుని జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. ఇసుక రీచ్‌లు జిల్లాలో లేనందున స్థానిక వనరుల స్ట్రీమ్స్ నుంచి గుర్తించి లబ్ధిదారుడి ఇంటి దగ్గరే ఇసుక సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంజీరా నది ఇసుక గురించి ఇరిగేషన్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్లందరూ జీవో ఎంఎస్ నెంబర్-03 ప్రభుత్వ నిబంధనలను చదవాలన్నారు.

**అవసరం మేరకు ఇసుకకు అనుమతివ్వాలి**

స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరా చేసే విషయంలో తహసీల్దార్లు ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఎన్ని క్యూబిక్ మీటర్లు అవసరం ఉంటుందో దాని వరకే అనుమతి మంజూరు చేయాలన్నారు. ఇసుక లోడింగ్ అన్‌లోడింగ్ రవాణా చార్జీలు విషయంలో ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. వర్షాకాలం రాకముందే ఇందిరమ్మ ఇండ్లు వాల్స్ వరకు పూర్తి అవ్వాలని చెప్పారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీలు సెగ్రిగేషన్ షేడ్స్, న్యూ గ్రామ పంచాయతీ బిల్డింగ్స్‌కు భూమిని గుర్తించే విషయంలో తహసీల్దార్లు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. సెగ్రికేషన్ షేడ్స్ గుర్తించేటప్పుడు నిబంధనలు పాటిస్తూ దారి తప్పనిసరిగా ఉండాలన్నారు. 05, 06 గుంటల భూమి అవసరం ఉంటుందన్నారు. జూన్ 2 నుంచి జిల్లాలోని ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ఆర్డీవోలకు తహసీల్దార్లకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూ ప్రాన్ జయచంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్‌రెడ్డి, మైనింగ్ అసిస్టెంట్ జువాలజిస్ట్ మధు కుమార్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సంబంధిత తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూంలు ఇండ్లు ఇవ్వాలి: సీఐటీయూ

చేగుంట, మే7: అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూంలు ఇండ్లు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది లక్ష్మీనర్సయ్యలు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం చేగుంటలో వినతి ప్రతం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్మిచిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో అర్హులైన వారికి అవకాశం కల్పించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లింగం (ఫైల్)

చేగుంట, మే7: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేగుంట పోలీసు స్టేషన్ పరిధిలోని మక్కరాజిపేట రోడ్డులో బుధవా రం జరిగింది. స్థానికు లు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా, దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన తొడంగి లింగం (54) చేగుంట సమీపంలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. చేగుంట నుంచి కర్నాల్‌పల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కంటెనర్ వాహనం ఢీకొట్టింది. దీంతో లింగం తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నట్లు మృతుడి సోదరుడు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమో దు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చేగుంట, మే7: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన చేగుంట మండలంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకున్నది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట బైపాస్ బ్రిడ్జి నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారి పక్కన ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం కాలబెట్టి, పడవేసి ఉంది. కాళ్లకు వెండి కడియాలు ఉన్నాయి. గుర్తు తెలియని మహిళ మృతదేహనికి సంబంధించి ఎవరికైనా ఆచూకీ కోసం చేగుంట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

# పాత వాహనానికి కొత్త నంబర్ ప్లేటు

**-పాత వాహనాలకు వర్తింపజేస్తూ రావాణా శాఖ నిర్ణయం**




మెదక్ మున్సిపాలిటీ, మే 7: పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు తయారైన వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. ఇందుకోసం గడువుగా సెప్టెంబర్ 30వ తేదీని నిర్ణయించింది. ఉమ్మడి మెదక్ జిల్లా పాత వాహనాల సంఖ్య లక్షల్లో ఉండే అవకాశం ఉంది. వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ విధానం 2014 ఏప్రిల్ 18వ తేదీ నుంచి అమలులోకి తెచ్చారు. ఈ విధానం అందుబాటులోకి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీను అమర్చుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ బాధ్యతను ఆయా ఏజెన్సీలకు అప్పగించారు. 2019 అక్టోబర్ 19 నుంచి వాహన కొనుగోలు డీలర్ల వద్దకు వెళ్లి ఈ నంబర్ ప్లేట్‌ను బిగించుకునే వెసులుబాటు కల్పించారు.

**ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలి**

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు కావాల్సిన పాత వాహనదారులు www.siaam.in వెబ్‌సైట్‌లో వాహన వివరాలు నమోదు చేసి బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొత్త ప్లేట్ అమర్చిన తరువాత ఆ ఫొటోను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు ఇతర సందర్భాల్లో ప్లేట్ చివరన ఉన్న లేజర్ కోడ్‌ను ట్రాక్ చేసి వాహనదారుడి పేరు వివరాలు తెలుసుకోవచ్చు. వాహనం ధ్వంసం అయినా లేజర్ కోడ్ ద్వా రా వివరాలు తెలుసుకునే వీలుంటుంది. వాహన బీమా, పొల్యూషన్ ధ్రువపత్రాలు జారీ చేయరు. సెప్టెంబర్ 30 తరువాత నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేయనున్నారు.

**చెల్లించాల్సిన రుసుం**

| | |
|---|---|
| ద్విచక్ర వాహనం | రూ. 320 నుంచి 380 వరకు |
| విదేశీ ద్విచక్ర వాహనం | రూ.400 నుంచి 500 వరకు |
| కార్లు | రూ.590 నుంచి 700 వరకు |
| విదేశీ కారు | రూ.700 నుంచి 860 వరకు |
| త్రీ వీలర్ | రూ.350 నుంచి 450 వరకు |
| వాణిజ్య వాహనం | రూ.600 నుంచి 800 వరకు |

# సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



రామాయంపేట: సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు ఖోఖో ఆడిస్తున్న ఉపాధ్యాయులు



వెల్దుర్తిలో సమ్మర్ క్యాంపులో యోగా చేస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

**- జిల్లా విద్యాధికారి రాధాకిషన్**

వెల్దుర్తి, మే 7: సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 21 ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, కంప్యూటర్, యోగా వంటి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబయ్య ఉన్నారు.

**విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి**

రామాయంపేట, మే 7: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే బాగా చదవాలని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరానికి విచ్చేసి విద్యార్థుల ఆటపాటలపై, కథలు, వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ధ్యానం, ఉపన్యాస, వ్యాస రచన, క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం.రమ, భరత్ తదితరులున్నారు.

## దోస్త్ షెడ్యూల్ విడుదల

మెదక్ మున్సిపాలిటీ, మే 7: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 ప్రథమ సంవత్సరంలో వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డిగ్రీ ఆ న్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్త్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈనెల 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. 29న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రఘు (ఫైల్)

నిజాంపేట, మే7: బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ జరిగిన ప్రమాదంలో నిజాంపేట యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట చెందిన కొమ్మాట రఘు(23) ఉపాధి కోసం ఆరు నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. దుండిగల్ సర్కిల్ వద్ద బుధవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో రఘు మృతి చెందాడు.

## మహిళ ఆత్మ హత్యాయత్నం

రామాయంపేట, మే 7: ఓ మహిళ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన రామాయంపేటలోని బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని బీసీ కాలనీ రోడ్డులో అద్దెకు ఉంటున్న ఒంటరి మహిళ పుష్ప(40) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నది. అద్దె ఇంట్లో ఉంటున్న మహిళ తెల్లవారు జామున తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఆమె అరుపులు విని చుట్టుపక్కల వారు, పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు భూసేకరణ అవార్డు విచారణ సమావేశం

నర్సాపూర్, మే7: నేడు నర్సాపూర్‌లోని రైతువేదికలో సంగారెడ్డి రీచ్ కెనాల్‌లో భూములు కోల్పోతున్న లింగాపూర్ రైతులతో భూసేకరణ అవార్డు విచారణ సమావేశం ఉంటుందని ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరివైనా తప్పులు ఉన్నా, అభ్యంతరాలున్నా సమావేశంలో రైతులు హాజరై తెలుపాలన్నారు.

## సికింద్లాపూర్ దేవస్థానం హుండీ లెక్కింపు

శివ్వంపేట, మే 7: మండలంలోని సికింద్లాపూర్ పంచాయతీలో గల లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా పరిశీలకుడు రంగారావు, ఈవో శశిధర్ ఆధ్వర్యంలో ఐదు నెలల హుండీ ఆదాయం రూ.4లక్షల14 వేల 833లు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు నర్సింహారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన శివ కేశవ సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

రామాయంపేట, మే 7: కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. బుధవారం రామాయంపేటలోని మేడే వారోత్సవాల్లో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు పెంచాలన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం



నిజాంపేట, మే 7: నస్కల్‌లోని బీడీ కాలనీలో ఇండ్ల సముహాల మధ్య రక్షణ కం చె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేక పోగా, కలుపు మొక్కలతో అపరిశుభ్రంగా ఉంది. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గంగమ్మ గుడికి భూమి పూజ

చిన్నశంకరంపేట, మే7: మండలంలోని గజగట్లపల్లిలో గంగమ్మ గుడి నిర్మాణానికి సద్గురు సారేశ్వర స్వామి పీఠాధిపతి భూమి పూజ చేశా రు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సం ఘం అధ్యక్షుడు బండి గోపాల కృష్ణ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి నర్సిం లు ముదిరాజ్, గజగట్లపల్లి ముదిరాజ్ సంఘం, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.